ఎన్నాళ్లీ నిరీక్షణ..?

- పట్టాల కోసం 40 ఏళ్లుగా ఎదురుచూపు
- తేలని రెవెన్యూ, అటవీశాఖ సరిహద్దులు
- పలుమార్లు ఆందోళనలు, వినతులు ఇచ్చిన రైతులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


737 సర్వే నంబర్‌లో రైతులు సాగు చేస్తున్న జీడి, మామిడి తోటలు

పట్టాల కోసం ఆ రైతులకు నిరీక్షణ తప్పలేదు. నలభై ఏళ్లుగా ఆ బంజరు భూములను సాగు చేస్తున్నా ఇప్పటికీ రైతులు పట్టాలకు నోచుకోలేదు. వీటికోసం ఎన్నోసార్లు ఆందోళనలు చేసినా....అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వాలు మారినా వీరిని పట్టించుకునేవారు కరువయ్యారు.

మాకవరపాలెం : మండలంలోని రాచపల్లి రెవెన్యూ లోగల 737 సర్వే నంబరులో సుమారు 1600 ఎకరాల ప్రభుత్వ బంజరు భూమి ఉంది. ఈ భూమిని రామన్నపాలెం, వెంకయ్యపాలెం, చిన రాచపల్లి, రాచపల్లి, తామరం, మాకవరపాలెం, యరకన్నపాలెం, జి.వెంకటాపురం, లచ్చన్నపాలెం గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు గత 40 ఏళ్లకుపైగా సాగు చేస్తున్నారు. జీడి, మామిడి మొక్కలు వేసుకుని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. వారు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు దరఖాస్తులు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికీ ఆ రైతులు పట్టాల కోసం విన్నవిస్తూనే ఉన్నారు.

అమలుకాని హామీలు

సాగుదారులు పట్టాల కోసం ఎన్నో సార్లు ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల క్రితం చేపట్టిన ఐదు, ఆరవ విడత భూ పంపిణీలో సర్వే చేసి రైతులను గుర్తించారు. ఈ సర్వే పూర్తిస్థాయిలో జరపలేదు. అరకొరగా చేసిన ఈ సర్వేలో వందమంది వరకు రైతులను గుర్తించి వదిలేశారు. పట్టాలు ఇస్తారని ఆశపడిన రైతులకు నేటికీ పట్టాలు మాత్రం పంపిణీ కాలేదు. దీనిపై రైతులు ప్రశ్నిస్తే రెవెన్యూ, అటవీశాఖ భూముల సరిహద్దులు సక్రమంగా లేవని అందుకే పట్టాల పంపిణీ నిలిపివేశామని అప్పట్లో అధికారులు సమాధానమిచ్చారు. ఈ రైతులకు పట్టాలివ్వాలంటూ సీపీఐ, సీపీఎం పార్టీలతోపాటు ఇతర రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పలు మార్లు ఆందోళనలు చేశారు. ఆ సమయంలో అధికారులు హామీలు ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

అరకొరగా సరిహద్దుల సర్వే..

రైతుల ఆందోళనల నేపథ్యంలో రెండు దఫాలు రెవెన్యూ, ఫారెస్టు అధికారులు సర్వే చేశారు. కానీ ఈ సర్వేను పూర్తి స్థాయిలో చేయకుండా మధ్యలోనే నిలిపివేశారు. దీంతో రైతులు పట్టాల కోసం ఇప్పటికీ ఎదురు చూపులు చూస్తూనే ఉన్నారు. ఈ భూమికి పట్టాలు ఇవ్వకపోవడం వల్ల పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారుల నుంచి అప్పులు తీసుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వే పూర్తి చేసి పట్టాలు మంజూరు చేయాలని సాగు రైతులు కోరుతున్నారు.


సర్వే సమయంలో మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సర్వే పూర్తి చేయాలి



737 సర్వే నంబర్‌లోని భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి సరిహద్దులు నిర్ధారించాలి. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు సర్వే చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీని వల్ల పట్టాలు అందక ఇబ్బందులు పడుతున్నాం.

అడిగర్ల వెంకునాయుడు, సాగురైతు, యరకన్నపాలెం

అప్పుచేసి సాగు చేస్తున్నాం



40 ఏళ్లుగా 737 సర్వే నంబర్‌లో ఉన్న బంజరు భూమి సాగుచేస్తున్నాం. పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలు అందడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పుచేసి సాగుచేస్తున్నాం.

కిల్లాడ లక్ష్మి, సాగు రైతు, వెంకయ్యపాలెం

తీరనున్న కల్వర్టు సమస్య


ఇందిరమ్మ మోడల్ కాలనీకి వెళ్లే రోడ్డులో గెడ్డపై కల్వర్టు నిర్మాణ పనులు

నాతవరం: ఇందిర మ్మ మోడల్ కాలనీకి వెళ్లే దారిలో ఏళ్ల తరబడి వెంటాడే కల్వర్టు సమస్యకు మోక్షం లభించింది. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న కమ్యూనిటీ స్థలంలో 2008లో అప్పటి ప్రభుత్వం సుమారుగా 289 మంది పేదలకు స్థలాలతో పాటు ఇల్లు మంజూరు చేసి ఇందిరమ్మ మోడల్ కాలనీ నిర్మించింది, ఈ కాలనీకి వెళ్లడానికి పోలీసుస్టేషన్ సమీపంలో గెడ్డపై కల్వర్టు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం సుమారుగా రూ.3 లక్షలు మంజూరు చేయడంతో కల్వర్టు నిర్మాణంతో పాటు కాలనీలో సిమెంట్ రోడ్డు పనులు చేస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల నాణ్యతపై ఇప్పటికే క్వాలిటీ కంట్రోల్ డీఈ యర్రాపాత్రుడు స్వయంగా పరిశీలించారు.

నేడు కిశోరీ వికాసంపై సదస్సు

మాడుగుల : మాడుగుల పాల కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరీ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ శ్రీదేవి తెలిపారు. మండలంలో గల ఆశ, అంగన్‌వాడీ, మహిళా పోలీసులు, విధిగా హాజరు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ హాజరుకానున్నట్టు ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు : గొండుపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో ఈ నెల 6 న శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల పనులతో పాటు కండక్టర్ ఛార్జింగ్ పనుల నిమిత్తం ఈ అంతరాయం కలగనుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఫీడర్ పరిధిలో గొండుపాలెం, గుల్లేపల్లి, చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మాడుగుల రూరల్ : మండలంలో విద్యుత్ లైను మరమ్మతు పనులు, కరెంటు తీగలకు అవరోధం కల్పిస్తున్న చెట్ల కొమ్మల నరికివేత వంటి పనుల వల్ల అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నేడు

దేవరాపల్లి : మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా తరలిరావాలని కోరారు.

కళ్యాణ వెంకన్న సన్నిధిలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ కుమార్


కె.జె.పురం జంక్షన్‌లో స్వామిని దర్శించుకున్న కుమార్

మాడుగుల రూరల్ : రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా పి.వి.జి. కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, సభ్యులు నాచు సునీల్ కుమార్ తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం శాలువతో సత్కరించి, వేంకటేశ్వర స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి కొండలరావు, జిల్లా సత్యసాయి సంస్థలు అధ్యక్షులు కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.


ఎక్సైజ్ సీఐగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ



గొలుగొండ : గొలుగొండ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా వి.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న మధుకుమార్‌ను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ రామకృష్ణను జిల్లా అధికారులు గొలుగొండకు బదిలీ చేయడం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన సీఐ రామకృష్ణ మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని, ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జన్నవరం వంతెనకు పొంచివున్న ముప్పు

- శిథిలమైన స్తంభాలు, ప్లాట్‌ఫారం
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు


శిథిలావస్థలో పెద్దేరుపై జన్నవరం వంతెన

చోడవరం : పి.ఎస్‌పేట రోడ్డులో ఉన్న జన్నవరం వంతెన ప్రమాదకరంగా ఉంది. చోడవరం- పి.ఎస్‌పేట రోడ్డులో పెద్దేరు నదిపై ఉన్న ఈ వంతెన చోడవరం, బుచ్చెయ్యపేట మండల కేంద్రాలను కలిపే వారధి. ఈ రోడ్డులో సుమారు 15 గ్రామాలు ఉన్నాయి. ఈ నది ఆవల ఉన్న గ్రామాలు చోడవరం రావాలంటే ఇదే ప్రధాన రహదారి. మండల కేంద్రం బుచ్చెయ్యపేటతో పాటు దిబ్బిడి, రాజాం, కందిపూడి, పెదమదీన, పెదపూడి, సీతయ్యపేట, నీలకంఠపురం, ఆర్.భీమవరం, పరిసర గ్రామా ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన చోడవరం రావాలంటే ఈ దారే దగ్గర దారి. నదికి ఇటు ఆరు కిలోమీటర్లు, అటు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న సుమారు 15 గ్రామాలను కలుపుతూ ఉన్న జన్నవరం వంతెన ఇటీవల శిథిలావస్థకు చేరింది. తరుచూ తుపానులు, భారీ వర్షాలకు నది పొంగి ప్రవహించడం, వంతెన ఉన్న ప్రదేశంలోనే నది మలుపు ఉండడంతో నీటి ప్రవాహం పోటుకి ఈ వంతెన స్తంభాలు దెబ్బతిన్నాయి. నదిలో స్తంభాలకు రక్షణగా ఉండేందుకు అడుగుభాగం కూడా కాంక్రీటు శ్లాబ్ వేశారు. ఆ శ్లాబ్ నాలుగు స్తంభాల వరకు వంతెన ఒడ్డు భాగం శిథిలమైపోయింది. అడుగు కాంక్రీటు దిమ్మలు ముక్కలు విరిగిపోయి వంతెన స్తంభాలకు రక్షణ లేకుండా పోయింది. దీనితో వంతెన ఏ క్షణాన కూలిపోతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. ఈ రోడ్డులో వంతెన పైనుంచి రోజూ వందలాదివాహనాలు నడుస్తుంటాయి. వీటితోపాటు మరో పదిరోజుల్లో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం కావడంతో చెరకు లోడుతో బరువు వాహనాలు కూడా ఇదే వంతెనపై రాకపోకలు సాగిసుంటాయి. ఏటి అవతల ఉన్న గ్రామాల నుంచి సుమారు 50 వేల టన్నుల చెరకు ఇటు ఫ్యాక్టరీ గేటు ఏరియాకు, నది ఒడ్డున ఉన్న పిఎస్‌పేట కాటాకు వస్తుంది. ఈ చెరకు తరలించేందుకు సుమారు 10 టన్నుల లోడుతో చెరకు ట్రాక్టర్లు, టిల్లర్లు, 3 టన్నుల బరువుతో చెరకు ఎడ్ల టైరుబళ్లు ఈ వంతెన పై నుంచి రాకపోకలు సాగిస్తాయి. అసలే బలహీనంగా ఉన్న ఈ వంతెన పైనుంచి ఇంత బరువైన వాహనాలు రాకపోకలు సాగించడంతో వంతెన మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. వంతెన పరిస్థితి ఇలా వుంటే ఇరుపక్కల ఉన్న నది గట్లు ఈ ప్రదేశంలోనే పూర్తిగా కోతకు గురై ఉన్నాయి. గట్లు పటిష్టం చేస్తామని నాయకులు చెబుతున్నా పనులు జరగలేదు. నది పొంగి నప్పుడల్లా నాయకులు,అధికారులు వచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పి వెళ్లిపోవడం తప్ప ఎటువంటి మరమ్మతులు, పునః నిర్మాణపనులు చేపట్టడం లేదని ఏటవతల గ్రామాల ప్రలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తక్షణం మరమ్మతులు చేపట్టాలి

వంతెన శిథిలావస్థలో ఉన్నా అధికారులు, నాయకులు ఎవరూ పట్టించుకోలేదు. వరదలు వచ్చినప్పుడు వచ్చి హడావిడిగా చూసి వెళ్లిపోవడం, ప్రతిపాదనలు పెట్టామని స్టేట్‌మెంట్లు ఇవ్వడం తప్పా పనులు మాత్రం జరగలేదు. ఈ వంతెన కూలిపోతే ఏటవతల గ్రామాలకు చోడవరంతో సంబంధాలు తెగిపోతాయి. తక్షణం మరమ్మతులు చేపట్టాలి.

-బైన ఈశ్వరరావు, వైఎస్ఎంపీపీ, కన్నంపాలెం

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామి షష్టి మహోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సుబ్రహ్మణేశ్వరస్వామి

నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టం బైపాస్ రోడ్డులోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణేశ్వరస్వామి దేవాలయంలో వినాయక పూజతో గురువారం షష్టి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు అనంతరం 60 లీటర్ల పాలతో స్వామి వారికి అభిషేకం గావించారు. ఉత్సవాలు మొదటి రోజు స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దోష నివారణ, సంతాన ప్రాప్తి కొరకు రాహు కేతు పూజలు జరిపించుకున్నారు.

మోదకొండమ్మకు వెండి ఆభరణాల సమర్పణ


ఎం.కోడూరులో మోదమాంబ ఆలయానికి వెండి ఆభరణాలు సమర్పిస్తున్న దాతలు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదకొండమ్మకు గ్రామానికి చెందిన దాతల సహకారంతో వెండి ఆభరణాలు సమర్పించారు. గురువారం సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు వాటిని అందజేశారు. పడాల అప్పలనర్సయ్య, పద్మావతి దంపతులు వారి కుమారులు పావు కిలో వెండిని అమ్మవారి కుంకుమ భరిణ అలంకరించే చేతిని తయారు చేసి అమ్మవారి అలంకరణకు అందజేశారు. బెంగళూరుకు చెందిన సాలూరు బాబా కృపానిధి కుమారుడు శరత్‌కిరణ్ మరో పావు కిలో వెండిని సమర్పించారు. కార్యక్రమంలో జల్లి హరిప్రసాద్, పడాల అప్పలనాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం పోటీల్లో ప్రథమ బహుమతి


విద్యార్థికి షీల్డు అందజేస్తున్న హెచ్ఎం రమేష్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది

రోలుగుంట : గత నెల 26 న జిల్లా స్థాయి రాజ్యాంగ దినోత్సవం పోటీల్లో మండలంలోని జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉల్లింగల హరీష్ ప్రథమ బహుమతి దక్కించుకున్నాడు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. ఈమేరకు జిల్లా స్థాయిలో పాఠశాలకు గుర్తింపు తెచ్చిన హరీష్‌కు గురువారం హెచ్ఎం రమేష్‌కుమార్ సహచర ఉపాధ్యాయులతో పాటు అభినందించి షీల్డును బహూకరించారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు


గాదిరాయిలో ప్రారంభమైన వరి కోతలు కోస్తున్న రైతులు

మాడుగుల : తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టడంతో మండలంలో రైతులు వరి కోతలు ప్రారంభించారు. అయితే వాతావరణంలో మబ్బులు ఏర్పడడంతో కలవర పడినా వరి కోతలు ప్రారంభించారు. మళ్లీ వర్షాలు పడితే పంట నష్టపోక తప్పదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ద్వారా నేటి వరకు రైతులకు ఎటువంటి భరోసా లేదని, ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని మండలంలో గల రైతులు కోరుతున్నారు.

ఆదివాసీలకు పుట్టిన తేదీ ధ్రువపత్రాలు జారీ


ఆదివాసీల వివరాలు నమోదు చేసుకుంటున్న తహసీల్దార్ నాగమ్మ, డీటీ శంకర్రావు

రోలుగుంట : ఆదివాసీలకు అవసరమై పుట్టిన తేదీ ధ్రువపత్రాల జారీ కార్యక్రమాన్ని గురువారం అర్ల పంచాయతీలో రెవెన్యూశాఖ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ పంచాయతీతో పాటు శివారు గ్రామాలైన లోసింగి, పిత్రుగడ్డ , పెదగరువు తదితర గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసీలకు పుట్టిన తేదీ ధ్రువపత్రాలు లేని కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ రోలుగుంట తహసీల్దార్ కార్యాలయం, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గత నెలలో వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఉన్నతాధికారులకు సమస్య నివేదించారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు, వీఆర్వోలు, ఆర్ఐతో కలసి గురువారం అర్ల వచ్చి ధ్రువపత్రాల జారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమ పిల్లలతో ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తహసీల్దార్ వారికి పుట్టిన తేదీ ధ్రువపత్రాలను జారీ చేశారు. సమస్య తీరడం పట్ల బాధిత గ్రామాల ఆదివాసీలు సర్పంచ్ వండల వనిత, గ్రామపెద్ద భాణం రాజారావు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మూర్తి, వీఆర్వోలు శ్రీనివాసరావు, చిరంజీవి పాల్గొన్నారు.

నేడు నూతన తోడపెద్దు పాల అచ్చు కార్యక్రమం


కె.జె.పురంలో తోడపెద్దుతో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో నూతన తోడపెద్దు పాల అచ్చు కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు స్థానిక సింహాద్రప్పన్న తోడపెద్దు సేవా గరిడి సంఘం (వేగి వారి సేవ గరిడి) గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10.05 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నమ్మి కనక వరహాప్రసాద్ అచ్చు వేస్తారని, వేగి వారి సేవ గరిడి దాసుడు వేగి హరికృష్ణ తెలిపారు. ఈ తోడపెద్దును గ్రామానికి చెందిన మద్దాల అప్పారావు కుమారుల ఆర్థిక సహాయంతో ఈ తోడపెద్దును ఇటీవల కొనుగోలు చేశారు. నూతన తోడపెద్దుకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు శుక్రవారం మధ్యాహ్నం కె.జె.పురం సచివాలయం పక్కన ఉన్న మద్దాల వెంకట సత్యనారాయణ ఇంటి వద్ద వున్న తోడపెద్దుకు పూజలు చేసి, అరటి పండ్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో మద్దాల వెంకట సత్యనారాయణ, సర్పంచ్ జామి రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు మళ్ల కన్నబాబు, ఆదారి శంకరావు, దాసుడు వేగి హరికృష్ణ పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి

రోలుగుంట : స్థానిక జూనియర్ కళాశాలలో గరువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం వ్యవసాయశాఖ అధ్వర్యంలో బోటనీ లెక్చరర్ ఎం.వి .ప్రసాద్ సౌజన్యంతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ జీవనం 95 శాతం మృత్తికను ఆధారం చేసుకొని ఉందన్నారు. ప్రధాన పోషకాలైన కార్బన్, నత్రజని, భాస్వరం, పొటాస్‌తో పాటు సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, సల్ఫర్ మొదలైనవి ఉంటాయని తెలిపారు. సాయిల్‌ను రక్షించుకోవడానికి ప్లాస్టిక్, ఎరువుల వినియోగం తగ్గించుకొని అడవులను బాగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎల్.ఉష, గుండుబాడు గ్రామ ఉద్యాన సహాయకుడు పి.కార్తీక్ పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ..


గవరపాలెం-డి.అగ్రహారం వెళ్ళే మార్గంలో రోడ్డుపైకి విస్తరిస్తున్న మొక్కలు

కె.కోటపాడు : మండలంలో గవరపాలెం నుంచి డి.అగ్రహారం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో మొక్కలు ఏపుగా ఎదిగి రోడ్డు భాగంలోకి విస్తరిస్తున్నాయి. వర్షాలకు ఈ మొక్కలు మరింతగా రోడ్డుపైకి వ్యాపించడంతో మార్గాలు చిన్నవిగా మారుతున్నాయి. ఈ మార్గంలో ఎదురెదురుగా ప్రయాణించే వాహనదారులు రోడ్లపైకి వ్యాపించిన మొక్కలతో ప్రయాణాల సమయాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు లేదా ఆయా పంచాయతీ అధికారులు జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా రోడ్డు భాగంలోకి విస్తరించిన మొక్కలను తొలగించే చర్యలను చేపట్టాలని ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు కోరుతున్నారు.

రహదారి మెరుగుకు చర్యలు తీసుకోవాలి

రోలుగుంట : చినుకుపడితే భీమిలి-నర్సీపట్నం తారురోడ్డులో ప్రయాణం నరకమే. రోలుగుంట నుంచి గ్రామం దాటే వరకూ రోడ్డు గోతులమయం . ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు బురదమయంగా మారింది. దీంతో వాహన చోదకులు, పాదచారులకు నిత్యం నరకంగా మారింది. సమస్య పరిష్కరిస్తామని చెప్పిన కూటమి నేతలు రహదారి బాగుకు దృష్టి పెట్టకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బురద రోడ్డులో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి బోల్తాపడుతున్నారు. వెంటనే రహదారి మెరుగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

చోడవరం: గ్రామాల్లో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ఈనెల 6వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రామారావు గురువారం చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ గ్రామసభ నిర్వహిస్తామని ఆయన చెప్పారు. 6వ తేదీన వెంకన్నపాలెం, 9 జన్నవరం, 10 బెన్నవోలు, 11 లక్ష్మీపురం, 12 అడ్డూరు, 13రాయపురాజుపేట, 16 జుత్తాడ, 17 దుడ్డుపాలెం, 18 గంధవరం,ఎం.కొత్తపల్లి, 19 శీమునాపల్లి, 20నర్సయ్యపేట, 21 అన్నవరం, వెంకయ్యగారిపేట, 23 ఖండిపల్లి, 24 ముద్దుర్తి, 26 తిమ్మన్నపాలెం, 27 చాకిపల్లి, 28 పీఎస్‌పేట, 30 గవరవరం , 31 గౌరీపట్నం, జనవరి 2వతేదీన శ్రీరాంపట్నం, అంకుపాలెం, 3 గోవాడా, భోగాపురం, 4 చోడవరం, 6 లక్కవరం, 7అంబేరపురం, గజపతినగరం, 8మైచర్లపాలెం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ చెప్పారు. ఆయా గ్రామాల్లో సచివాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ సభను నిర్వహిస్తామన్నారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు అర్జీలు సమర్పి ంచవచ్చన్నారు.

నాతవరం : గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. ఆయన గురువారం తన కార్యాలయంలో వీఆర్వోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి గ్రామసభలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం గ్రామసభలు నిర్వహించే రెవెన్యూ గ్రామంలో ముందుగా సమాచారం దండోరా వేయించాలని తెలిపారు. ముందుగా శుక్రవారం ఎం.బెన్నవరం పంచాయతీలో నిర్వహిస్తున్నామన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు ..

చీడికాద : మండలంలోని 34 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావు గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం తురువోలు సచివాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 గంటల నుంచి 3 గంటల వరకు వీరపురాజుపేటకు చెందిన రైతులు ఈ సదస్సును ఉపయోగించుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలుంటే అర్జీలు అందించాలన్నారు.

దేవరాపల్లి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైవాడ పంచాయతీ పరిధిలోని బేతపూడిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సదస్సులు జనవరి 5తో ముగుస్తాయన్నారు. స్థానిక ప్రజలు భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.